# కళాపూర్ణోదయము

## సంపూర్ణకళావిర్భావవిశ్లేషణ

(డాక్టరేటుపట్టాప్రదానానికి మద్రాసు విశ్వవిద్యాలయం
వారిచే ప్రామాణికముగా
(ఆంగ్లభాషలో) అంగీకరింపబడిన పరిశోధన గ్రంథము)

**జి.వి.కృష్ణరావు**

అనువాదం

**జాస్తి జవహర్లాల్**

ఎమెస్కో

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | మహాకావ్యం | 11 |
| 2. | కథాసంగ్రహం | 22 |
| 3. | మూలానుమానాలు | 33 |
| 4. | గుప్తార్థఖండన | 62 |
| 5. | సూరనవిమర్శకులు | 74 |
| 6. | కళాపూర్ణోదయంలో పాత్రలచిత్రణ | 102 |
| 7. | కళాపూర్ణోదయం - కావ్యనిర్మాణం | 133 |
| 8. | కళాపూర్ణోదయం - ఒక మహాకావ్యం | 152 |
| 9. | కావ్యభావము | 163 |
| 10. | సూరనదార్శనికత | 177 |
| 11. | సౌందర్యసిద్ధాంతం | 187 |
| 12. | సూరన సౌందర్యదృష్టి - సృష్టి | 213 |

# 1. మహాకావ్యం

పింగళి సూరన, అతని మూడు రచనలు - రాఘవపాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము - తెలుగుసాహిత్య పాఠకులందరికీ చిరపరిచితములే. రచయితలు, లాక్షణికులు కవిగా అతని ప్రావీణ్యాన్ని గుర్తించినా అతని ముఖ్య రచన ఐన కళాపూర్ణోదయానికి తగినంత గుర్తింపురాలేదు. సూరన రాఘవపాండవీయం రచించి ఉండకపోతే అతని ఇతర రచనలు కూడా గుర్తింపు లేకుండా మరుగునపడిపోయి ఉండేవనటంలో అతిశయోక్తిలేదు. పాత సంప్రదాయాల్లో పెరిగిన పండితమ్మన్యుల ఆదరణ వసుచరిత్ర, మనుచరిత్రల కున్నంతగా కళాపూర్ణోదయానికి లేకపోవటం సూరన స్వీయ సృజనాశక్తికి, అతని కాలంలోని ప్రాచీనతకు నిదర్శనం. తరువాతి కాలంలో వచ్చిన కవులు గాని లాక్షణికులు గాని అభినవగుప్తుడు ప్రతిపాదించిన రసధ్వనిసిద్ధాంతాన్ని చదవటానికి గాని, అర్థం చేసుకోవటానికి గాని ప్రయత్నించలేదు. బహుశ వారి ఆత్మలన్నీ క్షీణిస్తున్న సిద్ధాంతాల ఊబిలో కూరుకుపోయి ఉండవచ్చు. మాటలతో ఆటలు, చప్పబడిన సంఘటనలు, నిర్జీవమైన ప్రేమోపాఖ్యానాలు, పునరుక్తాలైన పురవర్ణనలు వారికి చాలా ప్రీతిపాత్రమైనవి. శ్లేషబంధాల నిర్మాణంలో తమ కౌశల్యాన్ని ప్రదర్శించిన వారికే వారి గౌరవం దక్కింది. విస్తారము, గంభీరములైన మానవానుభవాలను చిత్రించే రచనలేవీ వారినాకర్షించలేకపోయినవి. అందుకే రామరాజ భూషణుడు తన వసుచరిత్రలో సృజనాత్మకమైన రచనలు గాజుపూసలని, సాంప్రదాయికంగా వస్తున్న రచనలు మణిపూసలని జంకు లేకుండా చెప్పగలిగాడు.

ప్రస్తుతం ఉన్న జ్ఞానం సంపూర్ణమని, ఇంకా కొత్త విషయాలకు చోటులేదని, ఉన్న జ్ఞానాన్నిసంతరించు కోవటమే మానవ జీవితపరమావధియని చెపుతున్న మన తాత్త్వికదృక్పథమే ఇటువంటి ప్రతికూల భావనకు కారణమై ఉండవచ్చు. అటువంటి దురభిప్రాయాలు ప్రబలుతున్న కాలంలో సూరన సమకాలీనులు గాని, ఆ తరువాత

వచ్చిన సాహితీ ప్రియులుగాని కళాపూర్ణోదయానికి గుర్తింపు, గౌరవం ఇవ్వకపోవటంలో ఆశ్చర్యంలేదు. ఐనా చెదురుమదురుగా సూరన ఔన్నత్యాన్ని గుర్తించినవారు లేకపోలేదు. రామకృష్ణోపాఖ్యానంలో శ్రీపాద వేంకటాచలకవి, వేంకటేశ్వర విలాసంలో గణపవరపు వేంకటకవి, నైషధపారిజాతీయంలో కృష్ణాధ్వరి, పృథుచరిత్రలో పట్టమట్ట సరస్వతీ సోమయాజి చేసిన ప్రశంసలు చెప్పుకోదగినవి. ఇవికాక మద్రాసులోని అముద్రిత గ్రంథాలయంలో ఉన్న వ్యాఖ్యానాలు కూడా చూడవచ్చు. కళాపూర్ణోదయ గూఢార్థసంగ్రహమేకాక కొన్ని అధ్యాయాల మీద వ్యాఖ్యలు కూడా చూడవచ్చు. ముద్రణకు నోచుకున్న రచనలు కూడా కద్దు. వావిళ్ళవారు ప్రచురించిన కట్టమంచి రామలింగారెడ్డిగారి రచన, పిఠాపురంరాజావారు ప్రచురించిన సుబ్బయ్యశాస్త్రిగారి రచన కాక ఇంగ్లీషులో సి.పి.బ్రౌన్ కథాసంగ్రహం కూడా ప్రచురించాడు. తడికమళ్ళ రామకృష్ణరావు రచన కూడా ఉన్నది. ఇంతకు చెప్పవచ్చినదేమంటే కళాపూర్ణోదయాన్ని సమ్యక్దృష్టితో చదివి ఒక సంపూర్ణకావ్యంగా అవగాహన చేసుకున్నవారు లేరు. 1890 తరువాత కొన్ని వివరణలు వచ్చినా అవి తృప్తికరంగా లేవు.

కవిగానేకాక లోతైన ఆలోచనాపరుడు కూడా కావటం వలన సూరన కొత్తదనాన్ని, సృజనాత్మకరచనలనుకోరుకున్నాడు. గరుడపురాణము, రాఘవ పాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము తన ముఖ్య రచనలని సగర్వంగా చెప్పుకున్నాడు. వీటిలో మొదటిది అనువాదం. అశుభ సూచకమైన గరుడపురాణ అనువాదంతో తన రచనావ్యాసంగానికి ఎందుకు శ్రీకారంచుట్టాడో ఆశ్చర్యంకలిగిస్తుంది. కాని ఈ రచన మృగ్యంకావటం వలన దానిలో అతనిని ఆకర్షించిన ప్రత్యేకత ఏమిటో, దాని ద్వారా అతడేమి సాధించదలుచుకున్నాడో మనకు తెలియదు. అతని రెండవ రచన రాఘవపాండవీయం ద్వ్యర్థికావ్యం. తెలుగు సాహిత్యంలో మొదటిది. భారత రామాయణ కథలు రెంటినీ సులభశైలిలో చెపుతుంది ఈ కావ్యం. పాండిత్య ప్రకర్షలేకుండా సరళమైన భాషలో రెండుకథలను ఒకేచోట వివరించగలగటం ఈ రచన గొప్పతనం. ఇటువంటి కావ్యాలలో రసలోపం తప్పనిసరే ఐనా తరువాత వచ్చిన ఇటువంటి రచనలకంటే ఇదిచాలా మెరుగు. ఒకే పద్యంలో ఇమడ్చటానికి కష్టమైన విషయాలను ఆ గ్రంథాలు స్వీకరించి ఉండవచ్చును. ద్వ్యర్థికావ్యాలేగాక త్ర్యర్థి, చతురర్థి కావ్యాలు గూడా రాసి ఉండవచ్చు. కాని వాటిలో సూరన ప్రదర్శించిన స్పష్టత, సరళత, సౌందర్యము కానరావు. సమకాలీనులను